క్లుప్తంగా

రైల్వే గేట్ల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో భారీ ట్రాఫిక్ ఇక్కట్లు నెలకొంటున్న రైల్వే గేట్ల సమస్యలపై వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం మహిళా నాయకురాలు నూరి ఫాతిమా మంగళవారం నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు శ్రీ కృష్ణ దేవరాయలును, గుంటూరు రైల్వే డీఆర్ఎం రామకృష్ణలను కలసి చర్చించారు. నెహ్రూనగర్ ఆర్‌యూబీ, సంజీవయ్య నగర్, రెడ్డిపాలెంకు సంబంధించి ఆర్‌ఓబీల అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. ఈ విషయం పై స్పందించిన రైల్వే డీఆర్ఎం సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గం కార్పొరేటర్లు రామనబోయిన అజయ్, మార్కెట్ శ్రీను, పాపతోటి అంబేడ్కర్, యాట్ల రవి, డి.వంశీ, అగ్గిపెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతులమీదుగా సేవారత్న ప్రశంసాపత్రం



గుంటూరు వెస్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పథకంలో భాగంగా జూలై నెలలో ఉత్తమ సేవలందించినందుకు గాను లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆర్.నిఖిల్‌కు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సేవారత్న ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ జె.హనుమంతరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎన్.జయరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు కళావిపంచి వార్షికోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం కళావిపంచి 17వ వార్షికోత్సవం, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా డాక్టర్ రవి వడ్లమాని ఆదర్శ దంపతులకు ఆంధ్రకేసరి విశిష్ట సేవా పురస్కారం అందించి ఘనంగా సత్కరించనున్నట్లు కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు ప్రకటనలో తెలిపారు. భాగవతుల సౌమ్య కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

యువకుడు అదృశ్యం



గుంటూరు ఈస్ట్: యువకుడు కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లాకు చెందిన గోపు వెంకటరెడ్డి కుమారుడు రవికుమార్‌రెడ్డి చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ, బ్రాడీపేటలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 21వ తేదీ రవికుమార్‌రెడ్డి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమీప బంధువుకు మెసేజ్ పెట్టి, సెల్ స్విచ్ ఆఫ్ చేసి హాస్టల్ నుంచి ఎటో వెళ్లిపోయాడు. కుమారుడి ఆచూకీ కోసం వెతికిన వెంకటేశ్వర్‌రెడ్డి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం అందించాలన్నారు.

నిబంధనల మేరకే నిర్మాణాలు

- ఉల్లంఘిస్తే తగు చర్యలు
- నగర కమిషనర్ కీర్తి చేకూరి



అపార్ట్‌మెంట్ కొలతలను దగ్గరుండి పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా, సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణాలు చేయకుండా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కోదండ రామయ్య నగర్, ఉద్యోగనగర్, ఎస్‌వీఎస్ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డీపీఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. ర్యాంప్‌లు రోడ్డు మీదకు రాకుండా చూడాలని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు అశోక్ కుమార్, అజయ్ కుమార్, టీపీఎస్ హృదయరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

2050 నాటికి బ్రెయిన్ సమస్యలు పెరుగుతాయి

కేఎల్ యూనివర్సిటీ ప్రొ.చాన్స్‌లర్ ప్రొఫెసర్ జగన్నాధరావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జగన్నాథరావు, పక్కన డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ తారక్‌నాథ్

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా 2050 నాటికి బ్రెయిన్ సమస్యలు విపరీతంగా పెరిగిపోతాయని, వైద్య రంగానికి అదొక పెద్ద సవాల్‌గా మారుతోందని కేఎల్ యూనివర్సిటీ ప్రొ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జగన్నాథరావు అన్నారు. గుంటూరులోని బ్రింద న్యూరో ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం ఇంజినీరింగ్ విద్యార్థులకు న్యూరో నావిగేషన్, ఇంజినీరింగ్ టూ మెడిసిన్ అనే అంశంపై, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి బ్రెయిన్ సమస్యలు తొందరగా ఎలా కనుగొంటారనే విషయాలపై వర్క్‌షాప్ జరిగింది. ఈసందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ జగన్నాధరావు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇంజినీరింగ్ విద్యార్థులకు హాస్పటల్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించడం నేడు జరిగిందన్నారు. వర్క్‌షాపులో భాగంగా బ్రెయిన్ సర్జరీలు ఏవిధంగా చేస్తారనే విషయాలను ప్రాక్టికల్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. బ్రింద న్యూరో సెంటర్ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, కేఎల్ యూనివర్సిటీ, బ్రింద న్యూరో సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. న్యూరో నావిగేషన్ అంటే జీపీఎస్ సిస్టమేనని వెల్లడించారు. న్యూరో నావిగేషన్ ద్వారా వైద్యులకు ఆపరేషన్లు చేయడం చాలా సులువుగా మారిందన్నారు. సీనియర్ న్యూరాలజిస్టు తారక్‌నాథ్ అసోసియేట్ ప్రొఫెసర్ వసుధ, రేడియాలజిస్టు డాక్టర్ జమ్ముల అనిత, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవాలయంలో చక్రస్థాపన మహోత్సవాలు



విద్యుద్దీప దగదగల్లో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం



ఆలయంలో కొలువుదీరిన వీరభద్రస్వామి

యనమదల (ప్రత్తిపాడు): యనమదలలో కొలువుదీరిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం చక్రస్థాపన మహోత్సవాలకు ముస్తాబయ్యింది. గ్రామంలో కొలువుదీరిన వీరభద్రుని దేవాలయంలో ఈ నెల 23 నుంచి శ్రీ చక్రస్థాపన మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు వాసు శర్మ తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం కంకణధారణ, 108 అఖండాలతో శ్రీ చక్ర సహిత గ్రామోత్సవం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, జలాధివాసం, క్షీరాధివాసం నిర్వహించనున్నారు. గురువార అంకురారోపణ, వాస్తుహోమం, హోమ క్రతువులు, శ్రీచక్ర స్వరూపిణి అయిన అమ్మవారికి విశేష పూజలు జరపనున్నారు. అనంతరం రుద్రహోమం, నవగ్రహోమం, దాన్యాధివాసం జరగనున్నాయని చెప్పారు. 25న సామూహిక కుంకుమార్చన, వీరభద్రునికి పల్లెర మహోత్సవాన్ని నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం జరగనుందని వాసుశర్మ వివరించారు. సాయంత్రం చండీ హోమం, శ్రీచక్రస్థాపన జరుగుతుంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీప కాంతులతో దేవస్థానం అలరారుతోంది.

లక్ష్మారెడ్డికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు నివాళి



గుంటూరు ఎడ్యుకేషన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.లక్ష్మారెడ్డి భౌతిక కాయానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు నివాళులర్పించారు. మంగళవారం అమరావతిరోడ్డు నగరాలులోని లక్ష్మారెడ్డి నివాసంలో ఉంచిన ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. లక్ష్మారెడ్డికి నివాళులర్పించిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.హనుమంతరావు, ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు జి.హృదయరాజు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. నరహరి, ఎన్వీ రమణయ్య, ఉపాధ్యాయ నాయకుడు జి.కైలాష్‌నాథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కొమ్మూరు(కాకుమాను): గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు తనవంతు కృషి చేస్తానని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. కొమ్మూరులో మంగళవారం రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జెడ్పీ నిధులతో ఇప్పటి వరకు గ్రామంలో రెండు సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో జెడ్పీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గేరా జ్యోతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

నెహ్రూనగర్: రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది గిరిజనుల సంక్షేమం, వారి సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం దశాబ్దాలుగా కృషి చేస్తున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్‌లపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం అమ రాతి రోడ్డులోని సంఘ కార్యాలయంలో జరిగిన స మావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా గిరిజన నాయకులపై బురద జల్లి తమ పబ్బం గ దుపుకోవాలని చూస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రాంబాబు, రాష్ట్ర నా యకులు పాలపర్తి రామారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా రామకృష్ణా, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు నాణ్యమైన వైద్యసేవలు

- తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు వినియోగించుకోవాలి
- డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: మాతృ మరణాలను అరికట్టడంలో భాగంగా గర్భిణులు తప్పనిసరిగా తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) వాహనం సేవలను వినియోగించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు కోరారు. ప్రసవ తేదీకి ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి నాణ్యమైన, నిపుణులైన వైద్య ఆరోగ్య సేవలు వినియోగించుకోవాలన్నారు. ప్రసవ సమయానికి ముందుగా వారు కోరుకున్న ఆసుపత్రుల్లో చేరి తల్లికి ఏ విధమైన ప్రమాదకరమైన పరిస్థితులు రాకుండా ఉండేందుకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. గర్భిణులకు ప్రభుత్వం ఉచితంగా టిఫా స్కాన్, రెండు సాధారణ స్కానింగ్‌లు చేయించుకునే అవకాశం కల్పించిందన్నారు. గర్భిణులు గర్భంలో ఉండే బిడ్డ ఆరోగ్య పరిస్థితి ముందస్తుగా తెలుసుకునేందుకు ఉపయోగపడే అధునాతనమైన టిఫా స్కాన్‌ని ఉచితంగా అందిస్తున్న నేపథ్యంలో వినియోగించుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ప్రసవ సేవలు, సౌకర్యాలు పొందడంతోపాటు ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలకు రక్తహీనత వలన వచ్చే అనారోగ్య సమస్యలకు రాకుండా ఎఫ్‌సీఎం ఇంజక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. మాతృమరణాలు గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న సౌకర్యాలను గర్భిణులు వినియోగించుకోవాలని కోరారు.

వేద సీడ్స్‌లో చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పి.చంద్రశేఖర్, తోటా రంగారావు, ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది

కొరిటిపాడు: వేద సీడ్స్ – పద్మభూషణ్, మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వేడుకలు స్థానిక అరండల్ పేట లోని వేద సీడ్స్ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ పర్యవేక్షణలో మంగళవారం ఘనంగా జరిగాయి. వేద సీడ్స్ హెచ్ఆర్ మేనేజర్ తోట రంగారావు, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అడపా శ్రీనివాసరావు, సిబ్బందితో కలసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా తోట రంగారావు మాట్లాడుతూ సినీ రంగంలో తిరుగులేని మహోన్నతమైన వ్యక్తి చిరంజీవి అని, పేదలకు, సినీ అభిమానులకు ఎన్నో గొప్ప పనులు తలపెట్టిన మంచి మనిషి అని కొనియాడారు. 45 ఏళ్ల సినీ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఏదుర్కొని సినీ జీవితంలో శిఖరాగ్రస్థాయికి చేరుకున్నారని తెలిపారు. ప్రస్తుత నటీనటులకు ఆయనే స్ఫూర్తి అని అన్నారు. చిరంజీవి సినిమాలతో సరికొత్త రికార్డులను సృష్టిస్తూ, తనకు తానే పోటీగా హిట్ సినిమాలను అందించారన్నారు. జనరల్ మేనేజర్ అడపా శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి సేవా కార్యక్రమాల ద్వారా యువతను సేవా మార్గం వైపు నడిపించారన్నారు. నిరంతరం జిల్లాల వారిగా మెగా అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. నీలం శివరామకృష్ణ, గుడి సతీష్ కుమార్, జి.మనోహర్ రెడ్డి, తాయి శ్రీనివాసరావు, ఇక్కుర్తి వెంకటేష్, కె.నరేంద్రబాబు, తేలప్రోలు వెంకట్రావు, ఆళ్ల భాస్కరరావు, పి.చక్రపాణి, గాజుల సాయిరాం, మంగిశెట్టి రాజశేఖర్, వేద సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 16 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగభూషణం, రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం ప్రభాస్ వి కేర్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. స్కిన్ కేర్ అండ్ హెయిర్ కేర్ పోస్టుల భర్తీ కోసం సంస్థ హెచ్ఆర్‌డీ ప్రతినిధులు కిరణ్‌కుమార్, సుషీల్ పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కన్సల్టెంట్ డాక్టర్‌గా నెలకు రూ.25వేల వేతనాన్ని చెల్లిస్తారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి.డైరెక్టర్ పి.సీతారామయ్య, ప్లేస్‌మెంట్ సెల్ సమన్వయకర్త డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు అభినందించారు.

వేతనాలు పెంచాలని ఏపీఎంకు వినతి



పెదకాకాని: డ్వాక్రా యానిమేటర్ల(వీఓఏ) వేతనాలు పెంచాలని పెదకాకాని ఏపీఎం రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు తెలియజేశారు. ఏళ్ల తరబడిన పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు బ్యాంకు ఖాతాలకు వేయాలని, అర్హులైన వారికి సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాకాని పద్మ, వి.వెంకటలక్ష్మి, వి.వి జయలక్ష్మి, రాజశ్రీ, అరుణ, పద్మినీ ఉన్నారు.

విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేసిన ఎంఈఓ

చినలింగాయపాలెం(కాకుమాను): మన బడి, నాడు–నేడు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. చినలింగాయపాలెం ప్రాథమిక(స్పెషల్)పాఠశాలలో అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తయ్యేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉద్యోగులను స్వస్థలాలకు బదిలీ చేయాలి

పాత గుంటూరు: ఎస్ జీఎస్టీలో సాధారణ బదిలీలలో గుంటూరు జిల్లా, జోన్ 3కు చెందిన ఉద్యోగులు దూరప్రాంతాలైన విశాఖపట్నం, తిరుపతి, కడప బదిలీ అయ్యారని తిరిగి వారిని ఆన్‌డ్యూటీ (ఓడీ) సౌకర్యంపై తమ సొంత ప్రాంతాలకు రప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ది కమర్షియల్ టాక్స్ ఎన్‌జీఓ అసోసియేషన్ గుంటూరు–2 డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ జానీబాషా, వెంకట కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దూర ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగులందరూ కారుణ్య ప్రాతిపదికన నియామకమయ్యారని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రు లు ఆ ఉద్యోగులపై ఆధార పడి వున్నారని, తక్కువ సర్వీస్ కలిగినవారు, తక్కువ జీతాలతో జీవనం సాగిస్తున్నారని ఆ ఉద్యోగులను స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



చేబ్రోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ పొన్నూరు సీఐ సుకన్య మంగళవారం అరెస్ట్ చేశారు. బ్రాహ్మణ కోడూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని, ఆమె నుంచి 37 మద్యం క్వార్టర్ బ్యాటిల్స్ స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ గీతిక, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం



వృద్ధురాలిని వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు



జెడ్పీపాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి శైలజ

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

ఫిరంగిపురం: ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. వైద్యసేవలు సరిగా అందుతున్నాయా, నెలకు సరిపడా మందులు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన రోగుల వద్దకు వెళ్లి ఏ పరీక్షలు చేశారనే దానిపై వైద్యురాలు యానీగ్రేస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, ప్రతి ఒక్కరి పేరు నమోదు చేస్తున్న వివరాలు ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గర్భిణులు ఎందరు వస్తున్నదీ వారికి అందుతున్న సేవలు గురించి, ఆన్‌లైన్‌లో వారి వివరాలు నమోదు చేస్తున్న విషయాలను డేటా ఎంట్రీ ఆపరేటర్ విజయ్‌కుమార్‌ను అడగడంతో ఆ వివరాలు ఆన్‌లైన్ చేసిన విధానం తెలియజేశాడు. రోగుల వివరాలు నమోదుతోపాటు వారి ఫోన్ నెంబర్‌ను నమోదు చేసినట్లయితే క్యాంప్‌నకు రానిచో వారికి ఫోన్‌చేసి పిలిచేందుకు వీలవుతుందని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి సూచించారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన అవ్వ–తాత కంటివెలుగు ప్రోగ్రాంలో భాగంగా ఎందరిని పరీక్షించారనే దానిపై వివరాలు అడిగి, ఎంతమందికి ఆపరేషన్లు చేశారో, ఎందరికి కళ్లజోళ్లు అందించారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ, సూపర్‌వైజర్ కొండపల్లి సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, ఏఎన్ఎం పాపులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల తనిఖీ

మునగపాడు గ్రామంలో జెడ్పీ పాఠశాలను జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తనిఖీచేశారు. బడి ఈడు పిల్లలు బడిలో కొనసాగుతున్నారా, ఎందరు డ్రాప్‌అవుట్‌లో ఉన్నారో వాటి వివరాలను ఎంఈవోలు మహబూబ్ సుభానీ, రవికాంత్‌లను ప్రశ్నించారు.

బడి బయట పిల్లలు తప్పనిసరిగా బడిలో చదువుకునేలా చూడాలని చెప్పారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన యూనిఫాం, బూట్లు తప్పనిసరిగా ధరించి వచ్చేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. మరింత మెరుగుగా ఉండేలా చూడాలని చెప్పారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి శైలజ, ఏపీసీ విజయలక్ష్మి, ఎంపీడీవో డి.అనూరాధ, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మి, కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ రెహమాన్, వీఆర్వోలు బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, పాఠశాలహెచ్ఎం అంజనేదేవి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



నెహ్రూ నగర్: నటనే కాకుండా సేవా కార్యక్రమాలలోనూ చిరంజీవి తెలుగు ప్రజల్లో గుండెల్లో మెగాస్టార్‌గా నిలిచారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సంపత్ నగర్‌లో మెగా అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో మేయర్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి స్వశక్తితో తెలుగు సినీ ఇండస్ట్రీలో తిరుగులేని హీరోగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారన్నారు. విభిన్నమైన తన నటనతో, డాన్స్, ఫైట్స్ తో తెలుగు సినిమా ఖ్యాతిని దేశం నలుమూలలా వ్యాప్తి చేశారన్నారు. చిరంజీవి నటనలోనే కాకుండా బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ల ద్వారా సేవలోను తనకు సాటిలేరని నిరూపించారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల రమేష్, తేలుకుట్ల యోగేశ్వరరావు, కె.శ్యామ్ శేఖర్, ఖాజా మొహిద్దీన్, టెంట్ హౌస్ బాబు, మస్తాన్ వలి, రమేష్ పాల్గొన్నారు.